హరీశన్నా.. దుకాణాలు కూలగొడుతున్నరు!

- మాజీ మంత్రి ఎదుట గోడు వెల్లబోసుకున్న బాధితులు
- 28 ఏండ్లనుంచి ఉన్న దుకాణాల కూల్చివేత
- కారు దిగివచ్చి కమిషనర్‌తో మాట్లాడిన హరీశ్
- పేదల బతుకులు కూల్చొద్దని వినతి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/బండ్లగూడ, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): 'హరీశన్నా.. మా దుకాణాలు కూలగొడుతున్నరు. మమ్మల్ని ఆదుకోండి. 28 ఏండ్ల సంది ఇక్కడనే ఉంటున్నం. ఎవరూ మా జోలికి రాలె. కానీ ఇప్పుడొచ్చి రోడ్లు ఆక్రమించిండ్రని కూలగొడుతున్నరు..' అంటూ బండ్లగూడ జాగీర్‌కు చెందిన చిరు వ్యాపారులు మాజీ మంత్రి హరీశ్‌రావు ముందు కన్నీటి పర్యంతమయ్యారు. ఒక కార్యక్రమం నిమిత్తం సోమవారం బండ్లగూడ జాగీర్ పరిధిలోని కాళీమాత దేవాలయం మీదుగా హరీశ్‌రావు వెళ్తున్న సమయంలో మున్సిపల్ సిబ్బంది అక్కడ దుకాణాల కూల్చివేతలు చేపట్టారు. కాళీమాత ఆలయం వద్ద చిన్నచిన్న వ్యాపారాలతో పొట్టపోసుకుంటున్న సామాన్యులకు హరీశ్‌రావు వాహనాన్ని చూడగానే ప్రాణం లేచివచ్చింది. వెంటనే వారు ఆయన కారు ఆపి తమ గోడు వెళ్లబోసుకున్నారు. హరీశ్‌రావు వెంటనే కారు దిగి కూల్చివేతల వద్దకు వెళ్లి మున్సిపల్ సిబ్బందిని వారించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్‌తో అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడారు. సామాన్యుడు పొట్ట పోసుకునేందుకు చిన్న వ్యాపారాలు పెట్టుకుంటే వాటిని కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు.

రేవంత్ రాగానే ఆక్రమణలు కనిపించినయా?

కాళీమాత దేవాలయం వద్ద 28 ఏండ్లుగా చిరు వ్యాపారులు చేసుకుంటున్నారని, ఇన్నాళ్లూ ఎవరూ వీరికి జోలికి రాలేదని హరీశ్‌రావు మున్సిపల్ అధికారులతో అన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వీటిని కూల్చివేస్తారా? అని ప్రశ్నించారు. 'నోటీసులు ఇవ్వలేదు.. కనీసం వారికి సర్దుకునే సమయం ఇవ్వలేదు. దుకాణాల ముందు ఉన్న మెట్లు రోడ్డు మీదకు రాలేదు. అవి ఆక్రమణలు ఎట్ల అయితవి? మీరు కూలగొట్టేది మెట్లు కాదు.. వాళ్ల బతుకులను కూలగొడుతున్నరు. దుకాణాల్లోకి వచ్చే వాళ్లు ఎట్ల రావాలి? ఇప్పటికే హైడ్రా పేరుతో పేదల బతుకులు కూల్చివేశారు. ఆటో డ్రైవర్లు, బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఇప్పుడు దుకాణాలు కూలగొడుతున్నరు. వాళ్లు దందా ఎట్ల చేసుకోవాలి... కిరాయి ఎట్ల కట్టుకోవాలి.. కుటుంబాన్ని ఎట్ల పోషించుకోవాలి? ఇట్ల కూల్చివేస్తే దందాలు నడవక సచ్చిపోతరు. అర్థం చేసుకోండి' అని వేడుకున్నారు. నిజంగా వాళ్లు రోడ్డు మీదకొచ్చి కడితే కూల్చేయండి... కానీ రోడ్డు అవతలికి ఉన్న వాళ్ల దుకాణాలను లోపలికి వచ్చి కూల్చకండి' అని చెప్పారు. బాధితులతో మాట్లాడిన హరీశ్‌రావు తానున్నానని వారికి భరోసా కల్పించారు. అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నేత కేసీఆర్

- రేవంత్‌రెడ్డి పచ్చి అవకాశవాది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్

వరంగల్ జిల్లా రాయపర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి, ఫిబ్రవరి 10: దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నేతగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు ప్రఖ్యాతులు గడించారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కొనియాడారు. సోమవారం వరంగల్ జిల్లా రాయపర్తిలో స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్‌ఎస్ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ దూరదృష్టి కారణంగానే దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, కల్యాణలక్ష్మి, ఆసరా వంటి అద్భుత పథకాలకు శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల పదవులు పోతాయని, ఆయా స్థానాలకు ఉప ఎన్నిక తప్పదని పేర్కొన్నారు.

ఆర్‌ఎంపీలకు కాంగ్రెస్ అన్యాయం

- మ్యానిఫెస్టో హామీలను విస్మరించింది
- ప్రభుత్వం వారిమీద కేసులు పెట్టి బతుకుదెరువుకు దూరం చేస్తున్నది
- ఢిల్లీలో రేవంత్‌కు నో అపాయింట్‌మెంట్
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి
- ఆర్‌ఎంపీ, పీఎంపీల మహాధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు

ఇందిరాపార్క్ వద్ద ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ)/ కవాడిగూడ : ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. వారికి శిక్షణ ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి ఇప్పుడు మరిచిపోయిందని ధ్వజమెత్తారు. సోమవారం ఇందిరాపార్క్ వద్ద ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. 'ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. ప్రజలు వాళ్ల హామీలు నమ్మడం లేదని ఏకంగా బాండ్ పేపర్లమీద రాసిచ్చింండ్రు. ఆఖరికి రాహుల్‌గాంధీతో సోనియాగాంధీతో కూడా చెప్పించిండ్రు. ఆ హామీలేవీ అమలు కావడంలేదు.' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆర్‌ఎంపీలపై ఎలాంటి దాడులు చేసిన, కేసులు పెట్టిన దాఖలాల్లేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వారు కేసుల భయంతో బతుకుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ కండ్లు తెరిచి ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ స్థాయి వైద్యులను వేధించకుండా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ట్రైనింగ్ జీవో తెచ్చింది మేమే

'బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నాటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఆర్‌ఎంపీలు, పీఎంపీల ట్రైనింగ్ కోసం జీవో ఇచ్చిండు. ట్రైనింగ్ ప్రారంభించే తరుణంలో కొంతమంది కావాలని అడ్డుకొని కోర్టు నుంచి స్టే తెచ్చిండ్రు. నేను కూడా ట్రైనింగ్ నిర్వహించే-దుకు ఆదేశాలిస్తే దాన్ని ఆపేసేలా చేసిండ్రు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏరోజు కూడా మిమ్మల్ని ఇబ్బందిపెట్టలేదు. ఆర్-ఎంపీలు, పీఎంపీలు తమ సమస్యలను సంఘనాయకుల ద్వారా మాకు చెప్తే అర్ధగంటలో పరిష్కరించినం' అని హరీశ్ గుర్తుచేశారు.

ఏ ఒక్క హమీ అమలు చేయలే

'కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరి బతుకులు రోడ్డున పడ్డయి. గీత కార్మికుల పొట్టకొట్టి అక్రమ కేసులు పెడుతున్నరు. రైతులు, నేత కార్మి-కులు, ఆటో డ్రైవర్లు, చివరకు బిల్డర్లు సైతం ఈ ప్రభుత్వంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల ఆశ చూపించి అధికారంలోకి వచ్చింది. ఇప్పటివరకు ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు.' అని హరీశ్ మండిపడ్డారు. 'రైతు రుణమాఫీ మీద ఏ ఊరికైనా పోదాం చర్చిద్దాం. ఇవ్వాల్సింది రూ.45 వేల కోట్లయితే, ఇస్తామన్నది రూ.31 వేల కోట్లు, ఇచ్చామని చెప్తున్నది రూ.21 వేల కోట్లు, ఇచ్చింది మాత్రం సుమారు రూ.15 వేల కోట్లే. ఆ సొమ్ము కూడా వానకాలంలో రూ.8 వేల కోట్ల రైతు బంధు, రెండు నెలల రూ.2 వేలకోట్ల పింఛన్ సొమ్ము, కేసీఆర్ ఇచ్చే బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ చీరెలకు ఖర్చు చేసే రూ. వెయ్యి కోట్లు, గత ప్రభుత్వంలో న్యూట్రిషన్, కేసీఆర్ కిట్ల పథకాలకు చెందిన రూ.2 వేల కోట్లు, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాల-ర్‌షిప్ ఎగ్గొట్టి రైతు రుణమాఫీ ఇస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

సీఎంకు అపాయింట్‌మెంట్ దొరుకుతలేదు

సీఎం రేవంత్‌రెడ్డి 11 సార్లు ఢిల్లీకి పోయినా రాహుల్‌గాంధీ మాత్రం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని హరీశ్ తెలిపారు. 'రేవంత్‌రెడ్డి గాల్లో తిరుగుతున్నడు. ప్రజాస్వామ్యంలో ఓటే బలం. వచ్చే స్థానిక ఎన్నికల్లో అందరం ఒక్కటిగా నిలబడి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి' అని పిలుపునిచ్చారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీల సమస్యలపై తప్పకుండా అసెంబ్లీలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ధర్నాలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

> ఈ ప్రభుత్వంలో గ్రామీణ స్థాయి వైద్యులు ఏ రాత్రి ఎవరొస్తరో? ఏం కేసులు పెడుతరోనని భయంతో బతుకుతున్నరు. వాళ్లమీద కేసులు పెట్టి వైద్యులను బతుకుదెరువుకు దూరం చేస్తున్నరు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు ఇస్తమని చెప్పిండ్రు. దాన్ని ఎందుకు అమలు చేస్తలేరు?
> –హరీశ్‌రావు

హరీశన్నా.. బతకలేకపోతున్నం

- ఈ కాంగ్రెస్ పాలన మాకొద్దు
- స్కూల్ ఫీజులు, ఇంటి కిరాయి కట్టలేక అవస్థ పడుతున్నం
- హరీశ్‌రావుతో గోడు వెల్లబోసుకొని ఆటో డ్రైవర్ మల్లయ్య కన్నీళ్లు
- రోడ్డున పడ్డామని ఆవేదన
- మల్లయ్య కష్టం కలిచివేసిందన్న హరీశ్
- ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌కు సూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : 'పిల్లల ఫీజులు ఎట్ల కట్టాలె? ఇల్లు అద్దె ఎల్లాలె? ఈ పాలన మాకొద్దు. హరీశన్నా.. బతకలేకపోతున్నం. ఆటో కిరాయి 200 కూడా వస్తలేవు. మాకు చావు తప్ప వేరే దిక్కు లేదు.' అంటూ ఆటో డ్రైవర్ మల్లయ్య మాజీ మంత్రి హరీశ్ వద్ద కన్నీటి పర్యంతమయ్యాడు. ఆర్‌ఎంపీ, పీఎంపీల మహాధర్నాకు హాజరైన హరీశ్ రావు వద్ద తన గోడు వెల్లబోసుకున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశాడు. పిల్లలను చదివించలేకపోతున్నామని, ఉచిత బస్సుతో గిరాకీ దెబ్బతిని ఉపాధి లేకుండా పోయిందని కన్నీటి పర్యంత-మయ్యాడు. ఉచిత బస్సుకు ముందు రోజుకు వెయ్యి నుంచి 1500 వరకు సంపాదించేవాళ్లమని.. కాంగ్రెస్ వచ్చాక 200 కూడా గిరాకీ కావడం లేదని వాపోయాడు. ఆటో కిస్తీలు కట్టలేక నరకం చూస్తున్నామని వివరించాడు. ఇప్పటికే చాలామంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. చనిపోయినవారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడం లేదని చెప్పాడు. తమ సమస్యలపై మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని హరీశ్‌ను కోరాడు. రోదిస్తున్న ఆటో డ్రైవర్‌ను హరీశ్‌రావు ఓదార్చి ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు. అనంతరం ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'సీఎం రేవంత్ గారూ.. ఆటో డ్రైవర్ మల్లయ్య కన్నీళ్లు పెట్టుకున్న తీరు నన్ను కలిచివేసింది. ఇప్పటికైనా కండ్లు తెరవండి. రోడ్డున పడ్డ ఆటో కార్మికుల జీవితాలకు భరోసా కల్పించండి' అని కోరారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుతో గోడు వెల్లబోసుకుంటున్న ఆటోడ్రైవర్ మల్లయ్య

ఇసుక మాఫియాపై హైడ్రా ఉక్కుపాదం

- హైదరాబాద్‌లో అక్రమ రవాణాను అరికట్టే బాధ్యత అప్పగింత
- ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక
- సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుకను అందేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం గనుల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, జిల్లాలవారీగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసే బాధ్యతను హైడ్రాకు అప్పగించారు. ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతి ఇసుక రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్లు, స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్‌తో పాటు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇసుక రవాణా వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని, రిజిస్టర్డ్ లారీలను ఎంప్యానెల్ చేసేలా చర్యలు చేపట్టాలని, ఇసుక బుక్ చేసుకున్న 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరేలా చూడాలని ఆదేశించారు. ఇసుక వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని, ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిష్కారం జరిగేలా చూడాలని సూచించారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటుతప్పదని, ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అవసరమైతే స్వయంగా తానే ఆకస్మిక తనిఖీలు చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. పారదర్శకంగా అక్రమాలకు తావులేకుండా ఇసుక రవాణా జరిగేలా పర్మినెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలని, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆదేశించారు.

కరెంట్ కోతలు తప్పవా!

- రికార్డుస్థాయిలో 16వేల మెగావాట్లు దాటిన విద్యుత్ డిమాండ్
- ఐదు రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనాల్సిన దుస్థితి
- నేడు విద్యుత్ అధికారులతో సమీక్షించనున్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్ కోతలు తప్పవా..? అంటే ప్రస్తుత పరిస్థితులు అవుననే స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఏడాదికేడాది విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఈనెల 7న అత్యధిక రికార్డుస్థాయిలో 15,920 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. దక్షిణ తెలంగాణ డిస్కంలోనే అత్యధిక డిమాండ్ నమోదు కావడం విశేషం. ఈ ఒక్క డిస్కం పరిధిలో 10,136 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఉత్తర తెలంగాణ డిస్కం పరిధిలో డిమాండ్ 5 వేల మెగావాట్లుగా ఉంది. నిరుడు ఫిబ్రవరి 7న గరిష్ఠ డిమాండ్ 14,270 మెగావాట్లు మాత్రమే ఉండగా, ఈ ఏడాది మాత్రం డిమాండ్ 15000 మెగావాట్లు అధికంగా ఉండటం గమనార్హం. అయితే విద్యుత్ డిమాండ్ సోమవారానికి 15,804 మెగావాట్లకు పడిపోయింది. దీంతో అధికారులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు.

సగం బయటి రాష్ట్రాల నుంచే...

రాష్ట్రానికి అవసరమైన సగం విద్యుత్‌ను బయటి రాష్ట్రాల నుంచే కొనుగోలు చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారుల లెక్కల ప్రకారం 8వేల మెగావాట్లు మాత్రమే రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది. సోలార్‌తో కొంత, యాదాద్రి పవర్‌ప్లాంట్ నుంచి మరో 1600 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్నది. మిగిలిన 8వేల మెగావాట్లను ఢిల్లీ, పంజాబ్, హర్యాణా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ ఎంత పెరిగినా అందుకు తగ్గట్టు విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. కాగా, డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షించనున్నట్టు తెలిపారు.

సర్కారు, ఆర్టీసీ జేఏసీ మధ్య చర్చలకు బ్రేక్

- మార్చి 8వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా
- ప్రభుత్వం, యాజమాన్యం తీరుపై ఆర్టీసీ జేఏసీ ఆగ్రహం
- న్యాయవాదులతో చర్చించాక భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర సర్కారు, ఆర్టీసీ జేఏసీ మధ్య చర్చలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులతో చర్చలను ప్రభుత్వం నిలిపివేసింది. కార్మికుల డిమాండ్లలో ఆర్థిక పరమైన అంశాలు ఉండటం వల్ల ఎన్నికల అనంతరమే చర్చించే అవకాశమున్నట్టు సమాచారం. జనవరి 27న ఆర్టీసీ జేఏసీ ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇచ్చింది. 21 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టారు. ఈ క్రమంలో సోమవారం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు హైదరాబాద్‌లోని కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఎవరూ చర్చలకు హాజరవ్వలేదు. కోడ్ నేపథ్యంలో చర్చలను వాయిదా వేసినట్టు కార్మికశాఖ జంటనగరాల డిప్యూటీ కమిషనర్ సునీత పేర్కొన్నారు. చర్చలకు తేదీ నిర్ణయించి, మరోసారి పిలుస్తామని తెలిపారు. మార్చి 8వ తేదీ వరకు కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఆ తర్వాతే చర్చలు జరుగుతాయని సమాచారం.

కుట్రతోనే చర్చలకు బ్రేక్: ఆర్టీసీ జేఏసీ

ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తీరుపై ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీతో చర్చలను వాయిదా వేయడానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుందని ఆర్టీసీ జాక్ ప్రతినిధులు విమర్శించారు. ఎమ్మెల్సీ కోడ్ ఫిబ్రవరి 3 నుంచి అమల్లోకి వచ్చిందని, 7న తమను చర్చలకు ఎలా ఆహ్వానించారని ప్రశ్నించారు. మార్చి 8 వరకు కోడ్ అమల్లో ఉంటుందని కార్మికశాఖ అధికారులు తెలిపారని, దీనిపై న్యాయవాదులతో చర్చించి, 3రోజుల అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, టీఎంయూ అధ్యక్షుడు ఏఆర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ జేఏసీ వైస్‌చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కత్తి యాదయ్య తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు.

చివరిరోజు నామినేషన్ల వెల్లువ

- పట్టభద్రుల స్థానానికి 51 నామినేషన్లు
- ఉపాధ్యాయ స్థానాలకు 26 దాఖలు
- అన్ని స్థానాలకు కలిపి మొత్తం 140 నామినేషన్లు

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న కరీంనగర్ మాజీ మేయర్, ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ కలెక్టరేట్/నల్లగొండ : రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం సోమవారం ముగిసింది. చివరి రోజు కావడంతో దరఖాస్తులు వెల్లువెత్తాయి. అత్యధికంగా కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 51 మంది నామినేషన్లు వేయగా, ఇదే నియోజకవర్గం ఉపాధ్యాయ స్థానానికి 8 మంది నామినేషన్లు దాఖలుచేశారు. మొత్తం గ్రాడ్యుయేట్ స్థానానికి 100, టీచర్స్ స్థానానికి 17 నామినేషన్లు వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి తెలిపారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం టీచర్స్ నియోజకవర్గం నుంచి చివరి రోజు 18 నామినేషన్లతో కలిపి మొత్తం 23 నామినేషన్లు వచ్చినట్టు రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి వెల్లడించారు. మూడు స్థానాలకు కలిపి మొత్తం 140 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా, అదేరోజు సాయంత్రం బరిలో ఉండే అభ్యర్థుల సంఖ్య తేలనున్నది. 27న పోలింగ్ జరుగనున్నది. కాగా, నామినేషన్ల దాఖలుకు సోమవారం చివరిరోజు కాగా వందలాది మంది అనుచరులతో తరలివచ్చి అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఘర్షణ..

నామినేషన్ల చివరిరోజు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి వీ నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయడానికి మంత్రులతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అదే సమయంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేసి వెనుదిరిగారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం దాటుతుండగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వాహనంలోకి వెళ్తుండగా పోలీసులు అడ్డు చెప్పారు. అక్కడే ఉన్న రవీందర్‌సింగ్ జోక్యం చేసుకుని తమ వాహనాలు అనుమతించకుండా, మంత్రుల వాహనాలు ఎలా అనుమతించారంటూ పోలీసులను ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు పోలీసులు, రవీందర్‌సింగ్ మద్దతుదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది.

గురుకులంలో సగం మందికి జీతం రాలే!

- సత్వరమే విడుదల చేయాలని ఉద్యోగుల డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి10 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులందరికీ ప్రతినెలా ఒకటో తారీఖున జీతాలు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ఉత్తముచ్చట్లుగానే మిగిలిపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీలో పరిస్థితి ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నది. 10వ తేదీ దాటినా సొసైటీలో పనిచేస్తున్న సగం మందికిపైగా ఉద్యోగులకు జీతాలు పడలేదు. సొసైటీ పరిధిలో అన్నివిభాగాల్లో కలిపి మొత్తంగా 7000 మందికిపైగా టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఉన్నారు. వారిలో కేవలం 3000 మందికి మాత్రమే జీతాలు పడ్డాయని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు. ప్రతినెలా ఇదే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఓట్లే కీలకం

- టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల దిశ మార్చేది ఈ ఓట్లే..
- టీచర్ ఎమ్మెల్సీ పోరు రసవత్తరం
- మొదటి ప్రాధాన్యత ఓట్లతో బయటపడటం కష్టమే
- ముగిసిన నామినేషన్ల స్వీకరణ..

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు తారాస్థాయికి చేరింది. నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. ఇక నామినేషన్ల పరిశీలన, ప్రచారం, పోలింగ్, కౌటింగ్ ఘట్టాలు మిగిలాయి. అయితే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో, మూడో ప్రాధాన్యత ఓట్లే కీలకం కానున్నాయి. అభ్యర్థుల గెలుపోటములను ఈ ఓట్లే ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో తమకంటే తక్కువ ఓట్లు సాధించే అవకాశమున్నవారితో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు మీరు వేయించుకోండి. రెండు, మూడో ప్రాధాన్యత ఓట్లు తనకు వేయించాలంటూ ఇతర అభ్యర్థులతో మాట్లాడుకుంటున్నారు.

లెక్కింపు ఇలా..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకటి, రెండు, మూడు అన్న అంకెలను ప్రాధాన్యతాక్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపులో తొలుత మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం కన్నా ఒక ఓటు అధికంగా ఎవరికీ రాని పక్షంలో వరుసగా.. రెండు, మూడో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు.

అభ్యర్థులు ఖరారు..

కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి మల్క కొమురయ్య(తపస్-బీజేపీ), వంగ మహేందర్‌రెడ్డి(పీఆర్టీయూటీఎస్), తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి(సీపీఎస్‌ఈయూ), ఎం సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్(టీపీటీఎఫ్)లతోపాటు మరి కొందరు పోటీచేస్తున్నారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం స్థానంలో పింగిలి శ్రీపాల్‌రెడ్డి(పీఆర్టీయూటీఎస్), పూల రవీందర్(జాక్టో), ఏ నర్సిరెడ్డి(యూటీఎఫ్), పులి సరోత్తంరెడ్డి(తపస్-బీజేపీ), హర్షవర్ధన్‌రెడ్డి సహా మరికొందరు నామినేషన్లు దాఖలు చేశారు.



కులగణన ఎన్నికల స్టంట్

- అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు
- కావాలనే బీసీల లెక్కలు తగ్గించారు
- బీసీ కమిషన్ చైర్మనే ఒప్పుకుండు
- కాళేశ్వరంలో అవినీతి శుద్ధ అబద్ధం
- విచారణకు ఎప్పుడు పిలిచినా వెళ్త
- ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో హరీశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): 'కులగణన కాంగ్రెస్ ఎన్నికల స్టంట్. బీసీల ఓట్లను కొల్లగొట్టేందుకే హడావుడిగా సర్వేచేసి సెల్ఫ్‌గోల్ చేసుకున్నది. ఈ సర్వేతో సీఎం రేవంత్‌రెడ్డి చేసేదేమీలేదు. బలహీనవర్గాలకు ఒరిగేదేమీలేదు' అంటూ బీఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు విరుచుకుపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. సోమవారం ఆయన ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కులగణన, కాళేశ్వరం ప్రాజెక్టు తదితర అనేక అంశాలపై సవివరంగా సమాధానాలు ఇచ్చారు. తనదైన శైలిలో 14 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. అధికార కాంగ్రెస్ పార్టీకే చెందిన ఎమ్మెల్సీ తగలబెట్టిన ఈ సర్వేకు ఏమాత్రం విలువలేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కులగణనను తప్పుబడుతున్నారని చెప్పారు. సర్వేకు వచ్చేవారికి వివరాలివ్వవద్దని గతంలో రేవంత్‌రెడ్డి చెప్పిన మేరకే తామూ వివరాలు ఇవ్వలేదని తెలిపారు. కానీ, ఆస్తుల వ్యవహారం బయటపడతాయనే భయంతోనే సర్వేలో పాల్గొనలేదని చిల్లర మాటలు మాట్లాడటం విడ్డూరమని పేర్కొన్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో అన్ని వివరాలు ఉంటాయనే ఇంగితజ్ఞానం లేకుండా అసత్యాలు చెప్పడం సీఎం రేవంత్‌రెడ్డికే చెల్లిందని విమర్శించారు. కులగణన నివేదికను అసెంబ్లీలో టేబుల్ చేయని సీఎంకు.. ఎస్‌కేఎస్ సర్వే గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదని నిలదీశారు. ఉద్దేశపూర్వకంగానే బీసీల సంఖ్యను తగ్గించి చూపారని విమర్శించా రు. కులగణన తప్పుల తడకగా సాగింద ని బీసీ సంఘాల నాయకులు ఆగ్రహం తో ఉన్నారని, ఇప్పటికే మున్నూరుకాపులు, ముదిరాజ్‌లు, పద్మశాలీలు ఆందోళనకు సిద్ధమవుతున్నారని చెప్పారు.

హామీలపై మాటతప్పిన సర్కార్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, సన్నాలకు బోనస్ ఇస్తామని, పింఛన్లు పెంచుతామని, రైతుభరోసా ఇస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మాట తప్పిందని మండిపడ్డారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీతో చెప్పించిందని, కానీ ఏడాదిలో కనీసం 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకే కాంగ్రెస్ సర్కార్ నియామకపత్రాలు ఇచ్చి తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఏడాదిలో 6 వేల ఉద్యోగాలిచ్చి ఆర్భాటంగా ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ సర్కారుకే చెల్లిందని దుయ్యబట్టారు.

కాళేశ్వరంలో అవినీతే జరగలేదు

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ఎలాంటి అవినీతే జరగలేదని హరీశ్‌రావు స్పష్టంచేశారు. కానీ, అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ధ్వజమెత్తారు. తనపై కూడా ఆరోపణలు చేసి బురద జల్లుతున్నారని ఆక్షేపించారు. విచారణ కమిషన్ ఎప్పుడు పిలిచినా వెళ్లేందుకు తాను సిద్ధమని స్పష్టంచేశారు. వారడిగే ప్రతి ప్రశ్నకు సవివరంగా సమాధానాలు చెప్తానని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ సర్కారు బెదిరింపులకు బీఆర్‌ఎస్ ఎప్పటికీ భయపడబోదని చెప్పారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తులు

- మీసేవలో చేసుకునే అవకాశం
- పాత కార్డులో పేరు తొలగిస్తేనే..

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): కొత్తరేషన్ కార్డుల కోసం మీసేవలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే దరఖాస్తుల స్వీకరణ గడువుపై మాత్రం స్పష్టత లేదు. ప్రస్తుతం కొత్త కార్డులతోపాటు పాత కార్డుల్లో మార్పులు చేర్పులకు కూడా దరఖాస్తులు తీసుకుంటున్నారు. అయితే కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారంతా పాత కార్డులో పేరు ఉండకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత కార్డులో పేరు తొలగిస్తేనే కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. లేనిపక్షంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తును స్వీకరించదు. మార్పులు, చేర్పులకు కూడా ఇదే పద్ధతి వర్తించనున్నది. ఇక ప్రజాపాలనలో, ఇటీవల గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా? వద్దా? అనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. మీసేవ నిర్వాహకులు మాత్రం మళ్లీ దరఖాస్తు చేసుకుంటేనే మంచిదనే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.